

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని అన్ని సచివాలయ కేంద్రాల వద్ద వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ సెక్రెటరీ, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందువలన వాలంటీర్లు ఎక్కడ కూడా విధులకు హాజరు కాకూడదని, రేషన్ షాప్‌ల వద్ద కూడా ఉండకూడదని పేర్కొన్నారు. వాలంటీర్లకు ఇచ్చిన, మొబైల్ ఫోన్, తంబింగ్ మిషన్, వెంటనే సచివాలయ కేంద్రానికి అందించాలని పేర్కొన్నారు. వృద్ధాప్య పెన్షన్ పంపిణీ విధానంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు జాగ్రత్త వహించి ప్రతి ఒక్కరికి పెన్షన్ అదే విధంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి, పంచాయతీ సెక్రటరీ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏడి 'పింఛన్'

జిల్లా వ్యాప్తంగా ఆలస్యంగా పంపిణీ
40 శాతం మందికి నగదు అందజేత
పింఛనుదారులకు తప్పని పడిగాపులు



ఎర్రగుంట్ల : సచివాలయం వద్ద పింఛన్ కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పింఛన్‌దారులకు తిప్పలు తప్పడం లేదు. రాష్ట్రప్రభు త్వం ఐదేళ్లుగా వాలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి సామాజిక పెన్షన్లు అందజేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధి కార, ప్రతిపక్ష పార్టీలు పెన్షనర్ల ఓట్లపై కన్నేసిన నేపథ్యం వృద్ధులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎన్నికల కమిషన్‌కు వాలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయడంపై ఫిర్యాదుల ఫలితంగా సమస్య తలెత్తింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఉన్నఫళంగా తెరపైకి రావడం, ఇసి ఆదేశాల అమలులో దొర్లిన తొట్రుపాటు ఫలితంగా వృద్ధులకు ఇబ్బందులు తప్పడం లేదని చెప్పవచ్చు.

జిల్లాలోని 36 మండలాలు, ఆరు మున్సిపాలిటీల పరిధిలో 2,68,182 మంది పింఛనుదారులు ఉన్నారు. ప్రతినెలా రూ.28.61 కోట్ల పింఛన్ పంపిణీ చేయడం తెలిసిందే. ప్రభుత్వం ఐదేళ్ల నుంచి వాలంటీర్ల ద్వారా పకడ్బందీగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఉషోదయాన్నే పంపిణీ చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సామాజిక పింఛనుదారుల ఓట్లపై కన్నేయడం ప్రతిష్టంభనకు దారితీసింది. వాలంటీర్లు పింఛన్‌దారులను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అనుమానాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేసిన ఫలితం పింఛనుదారులకు వేదన తప్పలేదు. ఎన్నికల కమిషన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలనే ఆదేశాల అమలుకు సమయం చాలకపోవడం, అమలులో రాజకీయం కల గలిసిన నేపథ్యం పింఛన్‌దారులు సచివాలయాల ఎదుట పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలోని 644 సచివాలయాలకు ఎస్‌బిఐ, ఎపిజిబి, ఐడిబిఐఎల్ వంటి బ్యాంకుల నుంచి నగదు చేరడంలో ఆలస్యం గందరగోళానికి దారి తీసింది. ఫలితంగా మం గళవారం మధ్యాహ్నం నుంచి రెండు గంటల నుంచి 2,68,182 లబ్ధిదారులకు గానూ 1,09,685 మంది పింఛన్ దారులకు నగదు పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. సాయంత్రం ఆరు గంటల సమయానికి 40 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన వారికి రాత్రి 10 గంటల వరకు పంపిణీ ప్రక్రియ కొనసాగించను న్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన 50 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. మిగిలిన వారి కి రెండు, మూడ్రోజుల్లో పంపిణీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై జిల్లాలోని వేంపల్లి, చాపాడు మండలాల్లోని పింఛన్‌దారులను ఆరా తీస్తే వాలంటీర్లను తప్పించడం వల్లే తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రతిపక్ష టిడిపి తలపెట్టిన స్వార్థపూరిత నిర్వా కాల కారణంగానే ఇబ్బందులకు గురవుతున్నామని వాపోవడం గమనార్హం.

వాలంటీరు లేకపోవడం వల్లే

వాలంటీర్లు పింఛన్ సొమ్మును సకాలంలో అందించేవాళ్లు, వారికి నిలిపేయడంతో నాలుగు రోజులుగా పింఛన్ అందడం లేదు. మూడు, నాలుగు తేదీల్లో సచివాయాల్లో ఇస్తామన్నారు. వచ్చాం. ఉదయం నుంచి పడిగాపులు కాయడం తప్పలేదు. దీంతో చేసేదేమీ లేక ఇంటికి వెళ్లిపోతున్నాం.

- మరియమ్మ, పింఛనుదారు, మైదుకూరు.

ఉదయం వచ్చాను



పింఛను కోసం గడ్డంవారిపల్లె నుండి సచివాలయానికి ఆటోలో వచ్చాను. సచివాలయ అధికారులు డబ్బులు ఇస్తాం అదిగో.. ఇదిగో వేచి ఉండు అంటున్నారు. కానీ ఎప్పుడిస్తారో చెప్పడంలేదు. మధ్యాహ్నం అయింది. భోజనం సమయం అయినా కూడా పింఛను ఇవ్వలేదు.

- డి.కృష్ణమ్మ, వృద్ధురాలు, గడ్డంవారిపల్లి.

షుగర్ వ్యాధితో బాధపడుతున్నాను



నాకు షుగర్ వ్యాధి ఉంది. పెన్షన్ కోసం సచివాలయం వద్ద వేచి ఉన్నాను. అధికారులు పాత పద్ధతిలోనే పెన్షన్ ఇంటి వద్దనే ఇచ్చి ఉంటే బాగుండేది. సచివాలయం వద్ద పడిగాపులు కాయాలంటే కష్టంగా ఉంది.

- ఎన్.పీరమ్మ, పింఛనుదారు, మైదుకూరు.

సచివాలయాల వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది



ఈనెల పింఛన్ డబ్బుల కోసం సచివాలయాల వద్దకు రావాలని అధికారులు చెప్పారు. ఈ పింఛన్ సొమ్ము కోసం మూడు రోజుల నుంచి ఎదురు చూస్తున్నాం. గతంలో మాదిరి ఇంటి వద్దకే పింఛన్ అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- వెంకటమ్మ, వితంతు, సింహాద్రిపురం.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు

ప్రజాశక్తి-కడప

ఎన్నికల ప్రచార కార్యకలాపాల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడే ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపెయిన్, రోడ్‌షో లాంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టూ డోర్ ప్రచారానికి కూడా పర్మిషన్ తప్పక తీసుకోవాలన్నారు. ఎంసిసిపై రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మీడియా ద్వారా అవగాహన కల్పించామన్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ప్రత్యక్ష ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా విచారించి చర్యలు చేపడతామని తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల పోలింగ్ వరకు కూడా ఫార్మ్-6 అభ్యర్థనలు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాలో 15 వేల మందికిపైగా విధులను కేటాయించామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, హెచ్ఆర్ పాలసీ నియామక ఉద్యోగులకు మాత్రమే విధులను కేటాయించామని తెలిపారు. మహిళలకు ఎన్నికల విధుల కేటాయింపులో నియోజకవర్గ పరిధిలోని వారికి డ్యూటీలను అలాట్ చేస్తామన్నారు. ఇవిఎంల పరంగా లెక్క ప్రకారం జిల్లాకు సరిపడా మేర సిద్ధంగా ఉన్నాయన్నారు. 14, 15వ తేదీన మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపడతామని చెప్పారు. ఈ నెల 13, 14వ తేదీల్లో పిఒ, ఎపిఒలకు మొదటి విడతలో, మే నెలలో రెండవ విడతలో శిక్షణ ఇస్తామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అభ్యర్థులు వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్స్‌లకు సంబంధించిన రేటింగ్ కార్డు ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా అధికారులు కానీ, పార్టీల ప్రతినిధులు కానీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే సి.విజిల్ యాప్ ద్వారా, లేదా కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950 లేదా కాల్ చేసి తెలిపితే వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.ప్రతాప్ రెడ్డి (టిడిపి), కానుగ దానం (బిఎస్‌పి), జి.లక్ష్మణ్‌రావు (బిజెపి), బి.పాల్ సుధాకర్ (కాంగ్రెస్), ఎం.భరత్‌రెడ్డి (వైసిపి), డాక్టర్ బి.శ్రీనివాసులు (ఆప్), మనోహర్ (సిపిఎం) తదితరులతో పాటు సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవు

- విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

ప్రజాశక్తి-కడప

పనితీరు మెరుగుపరుచుకోకుంటే చర్యలు తప్పవని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ అధికారులను హెచ్చరించారు. ప్రతి మనిషికి ప్రాథమిక అవసరాలలో విద్యుత్ కూడా ఒక భాగమైందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, చిన్నపాటి అంతరాయాలకు కూడా ప్రజలు సహించే పరిస్థితిలో లేరన్నారు. లైన్లను ట్రాన్స్‌ఫార్మర్లను ముందస్తుగా మరమ్మతులు చేసుకోవాలన్నారు. అత్యవసర పనులకు మాత్రమే విద్యుత్‌ను ఆపాలని చెప్పారు. బుధవారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పథకాల పనులను అత్యధిక ప్రాధాన్యతతో యుద్ధప్రాదిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంతోనే అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ఒక్క క్షణం ఆలోచించి భద్రత నియమాలను పాటించి విలువైన ప్రాణాన్ని కాపాడి ఒక కుటుంబాన్ని నిలబెట్టాలని తెలియజేశారు. లోఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయండని ఆదేశించారు. పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగు చర్యలు తీసుకోని విద్యుత్ వృథాను అరికట్టాలని హెచ్చరించారు. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు ఇస్తుంది, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దు, విద్యుత్ బకాయిలు వసూలు పై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని పేర్కొన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కడప డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు

ఆటిజం వ్యాధిని నివారించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

తల్లిదండ్రులు వారి పిల్లలకు ఆటిజం వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకుని, నివారించుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినత్సోవం జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో ఐఎపి కడప వారిసహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో తగిన సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎపి ఇబి సభ్యులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ బాలకృష్ణ, ఐఎంహెచ్ సూపరిడెంటెండ్ డాక్టర్ వెంకటరాముడు, చిన్నిపిల్లల విభాగం హెచ్ఒడి డాక్టర్ వంశీధర్, డాక్టర్ విష్ణువందన, ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ ఎస్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ పోటీ నుంచి అవినాష్ తప్పుకోవాలి : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యా నేరం ఎదుర్కొంటూ, ఎంపీగా పోటీ చేస్తున్న వైఎస్.అవినాష్‌రెడ్డికి ప్రజాస్వామ్యం, ప్రజలపై నమ్మకం ఉంటే, పోటీ నుంచి తప్పుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల అసెంబ్లీ టిడిపి అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బిటెక్ రవి) డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లో ఉన్న శ్రీనివాసరెడ్డి నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డి ఎంపీ సీటు మనకే ఉండాలని జగన్‌కు చెబితే, షర్మిల ఒప్పుకుంటే అభ్యంతరం లేదని చెప్పడంతో వివేకా రెండు గంటలు షర్మిలతో మాట్లాడి ఒప్పించారని తెలిపారు. ఎంపీ సీటు కోసం వివేకాను చంపితే తప్ప కుదరదనే హత్య చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా షర్మిల కాంగ్రెస్ పార్టీ నుంచి కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుంటే, వైఎస్ఆర్ కొడుకుగా జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్‌కు ఎంతో ఇష్టమైన తమ్ముడు వివేకా హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్‌ను, చెల్లి షర్మిలపై పోటీకి దింపడం వైఎస్ ఆత్మ శోభించడానికా, శాంతించడానికి అని ప్రశ్నించారు. ఎంపీ సీటు మనకే ఉండాలని వివేకా జగన్‌కు చెబితే, షర్మిల ఒప్పుకుంటే అభ్యంతరం లేదని జగన్ చెప్పడంతో రెండు గంటలు షర్మిలతో మాట్లాడి ఆమెను ఒప్పించడంతో, ఇక ఎంపీ సీటు వివేకాను చంపితే తప్ప కుదరదనే హత్య చేశారని పేర్కొన్నారు. కడపలో ఎంపీ అభ్యర్థిగా వివేకాను హత్య చేసిన వాళ్లకే సీటు ఇచ్చారని షర్మిల స్పష్టంగా చెప్పారన్నారు. తాత, తండ్రి రక్తం జగన్‌లో ప్రవహిస్తూ ఉంటే, సొంత చిన్నాన్న హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని, సొంత చెల్లిపై పోటీకి ఎలా నిలబెడతావని నిలదీశారు. వైఎస్ విజయమ్మ కూతురు షర్మిల వైపా, మరిదిని చంపిన వారి వైపా పులివెందుల ప్రజలకు చెప్పాలన్నారు. హత్యా రాజకీయాలను జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆయన చెల్లెళ్ల నోటి వెంట వస్తున్నాయని అన్నారు. వివేకా హత్య ప్రభావం ఎన్నికల్లో ఎక్కువగా ఉంటుందని, షర్మిల బాగా ప్రచారం చేస్తే, టిడిపి గెలుపు సులభతరం అవుతుందని, వైసిపి ఓట్లు చీలుతాయని ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

నేడు కడపకు నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం కడప నగరానికి నారా భువనేశ్వరి రానున్నారు. ఉదయం 11 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 45వ డివిజన్ చెమ్మూమియాపేటలో కార్యకర్త కుటుంబాన్ని 11.20 గంటలకు పరామర్శిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రొద్దుటూరు వెళతారు.

కాళ్లు కోల్పోయిన డ్రైవర్‌కు చేయూత

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎఎస్ఆర్ నగర్‌లో నివసిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ క్రాంతి ప్రమాదవశాత్తు కాళ్లు కోల్పోయాడు. అతని కుటుంబం రోడ్డుపాలైంది. విషయం తెలుకున్న స్త్రీ శక్తి సేవా సమితి టీం వారు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. మూడు నెలలకు సరిపడా మూడు బస్తాల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు బాల సరస్వతి మాట్లాడుతూ డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అల్పాహారం వితరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో బుధవారం అల్పాహార వితరణ చేశారు. చమర్తి నారాయణ రాజు తల్లి మంగమ్మ జ్ఞాపకార్థం అల్పాహారం అందించారు. కార్యనక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు, డైరెక్టర్ మన్నూరు వెంకటరమణారెడ్డి, ఎన్.మల్లికార్జున, విజయశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ బుధవారం పరిశీలించారు. టిజిపి పార్క్, గాంధీ ప్లాజా, మున్సిపల్ స్టేడియం ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పార్క్ పనులను రేఖాచిత్రం ద్వారా పూర్తి చేయాలని పేర్కొన్నారు. రెండు లేయర్‌లు, 150 అంగుళాల మూరమ్‌ను తొలగించవద్దని అధికారులకు సూచించారు. ఇసుక పొరలు, పాలిష్ చేసిన తాండూరు రాయి వేయాలని చెప్పారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ కోర్టులు నిర్మించుటకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల అనంతరం జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగాధికారులకు సూచించారు. గాంధీ ప్లాజా పనులు నాణ్యతను పరిశీలించారు. పనుల పురోగతిని పెంచాలని పేర్కొన్నారు.

వైవీయూ ఎడెక్స్ కోర్సులో నమోదుకు స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వ విద్యాలయములోని ఎడెక్స్ అందించే కోర్సులలో నమోదు కేంద్రాన్ని(లైసెన్స్ యాక్టీవేషన్ అండ్ కోర్సెస్ ఎన్రోల్మెంట్ హెల్ప్లైన్ సెంటర్) బుధవారం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి సందర్శించారు. ఈ కోర్సుల్లో 400 మంది ఫ్యాకల్టీ విద్యార్థులు వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కోర్స్‌లో చేరడం ద్వారా ప్రపంచములో ప్రముఖ యూనివర్సిటీల ఫ్యాకల్టీ లెక్చర్ వీడియోస్ చూడడంతో పాటు మెటీరియల్స్‌ను విద్యార్థులు ఉచితంగా పొంది వాటిని సాధన చేయాలని ప్రిన్సిపల్ చెప్పారు. తద్వారా ప్రపంచ స్థాయి జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. ఏడెక్స్ ప్రోగ్రాం కోర్స్ ఛాంపియన్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రెడ్డయ్య, కోర్సులో చేరిన విద్యార్థులను అభినందించారు.

బిసి నాయకుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కడప సిటీ

బిసి సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి నంద్యాల సుబ్బరాయుడు ఇటీవల ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం చలమారెడ్డిపల్లిలో ఉన్న సుబ్బరాయుడు స్వగృహానికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. బిసి సంక్షేమ సంఘానికి సేవలందిస్తున్న సుబ్బరాయుడు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి మల్కానీ త్రివిక్రమరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.నటరాజ్, జిల్లా కోశాధికారి ఎం.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ల గంగయ్య సుబ్బరాయుడు కలిసి పరామర్శించారు.



సుబ్బరాయుడుకు సాయమందిస్తున్న నాయకులు



నియామక పత్రం అందజేస్తున్న విసి సుధాకర్

వైవీయూ డీన్‌గా ఆచార్య సుబ్బరాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ఎంబిఎ ఆచార్యులు వై.సుబ్బరాయుడును నియమిస్తూ విసి ఆచార్య చింతా సుధాకర్ నియామక పత్రాన్ని తన చాంబర్లో అందజేశారు. ఇదివరకు డీన్‌గా ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య టి.శ్రీనివాస్ పదవీకాలం పూర్తవడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతన డీన్‌గా నియమితులైన సుబ్బరాయుడు మూడేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. అకడమిక్, పరిశోధనలపరంగా ఆయా విభాగాల అభివద్ధికి కషి చేయాలని విసి సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'బాసట' హోమ్‌లో అన్నదానం

ప్రజాశక్తి-కడప అర్బన్



భోజనం చేస్తున్న చిన్నారులు

నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోమ్‌లో బుధవారం నెల్లూరు పొట్టి శ్రీరాములు జిల్లా రత్నం విద్యా సంస్థల అధినేత కె.వి.రత్నం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వేణుగోపాల్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సామాజిక మాధ్యమాల్లో బాసట సేవా కార్యక్రమాలను తెలుసుకుని హోమ్‌లో పిల్లలకి అన్నదానానికి సహాయం చేశారు. ఈ సందర్భంగా బాసట అధ్యక్షులు ఎం.బాలాజీ రావు వారికి, వారి కుటుంబ సభ్యులకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలు రూ.6 వేలు అందజేసినట్లు చెప్పారు.

యూరియా కలిపిన నీరుతాగి 27 గొర్రెలు మృతి

మరో 60 గొర్రెలకు అస్వస్థత



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని బుడ్డయపల్లె గ్రామ సమీపంలోని ఇటుకల బట్టి వద్ద బుధవారం ఉదయం యూరియా కలిపిన నీరు తాగి 27 గొర్రెలు మృతి చెందాయి. మరో 60 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. పెండ్లిమర్రి మండలం కార్పొరేట్‌పల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి, బాల గంగయ్య, వడ్డెరపు చిట్టిబాబు, వీరాంజనేయులు, గంగరాజు, ప్రసాదు గొర్రెలను చెన్నూరు చుట్టుపక్కల పొలాలలో మేపుకొనేందుకు వచ్చారు. రోజులాగే అక్కడ వారు గొర్రెలను మేపుకొనుచుండగా కొన్ని గొర్రెలు పక్కనే ఉన్న ఇటుకల బట్టి వద్ద నీటిని తాగడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన గొర్రెల కాపర్లు ఇటుకల బట్టి యజమానిని తొట్టిలో ఉన్న నీటిలో యూరియా కలిపావని నీరు తాగిన మా గొర్రెలు చనిపోయాయయిన అడుగగా, ఇటుకల బట్టి యజమాని బాషా వారిపై దుర్భాషలాడుతూ నీటిలో యూరియా కలిపానని, నీ ఇష్టం వచ్చినవారికి చెప్పుండని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. ఈ విషయాన్ని గొర్రెల కాపర్లు పోలీసులు, పశు వైద్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షుడు చిన్న మల్లయ్య యాదవ్, అఖిల భారత యాదవ సంఘం కార్యదర్శి చీర్ల చెన్నయ్య యాదవ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉపేంద్ర, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్ సంఘటనా స్థలంలో మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. యూరియా కలిపిన నీటి తొట్ల దగ్గరికి వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని విచారించగా ఇటుకలు నాణ్యత కోసం ఏరియా కలపాల్సి వచ్చిందని వారికి వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరమణ, ఖాజీపేట పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మురళి, కడప పశుసంవర్ధక శాఖ లాబరేటరీ డాక్టర్లు జి.రాంబాబు, సంధ్యారాణి, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉపేంద్ర, విఆర్ఒ వెంకటసుబ్బయ్య, పోలీసులు అక్కడికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. యూరియా కల్పిన నీటిని మృతి చెందిన గొర్రెల నుంచి కొన్ని పదార్థాలను పరిశోధన కోసం పశుసంవర్ధక శాఖ అధికారులు ల్యాబ్‌కు తీసుకువెళ్లారు. అటు గొర్రెల కాపర్లు పెండ్లిమర్రి మండలం కారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెందిన బాల గంగయ్యకు చెందిన గొర్రెలు వడ్డేపు చిట్టి బాబుకు సంబంధించి గొర్రెలు, వీరాంజనేయులు కు సంబంధించి మూడు గొర్రెలు మృతి చెందినట్లు నిర్ధారించారు. మండల పశువైద్యాధికారి. డాక్టర్ ఉపేంద్ర మాట్లాడుతూ అస్వస్థతకు గురైన గొర్రెలను మందల నుంచి వేరుచేసి వాటికి చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ఇటుకల బట్టి యజమాని తమ గొర్రెలకు నష్టపరిహారం ఇవ్వాలని గొర్రెల కాపరులు డిమాండ్ చేశారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసిందని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు కేటాయించిన 1,84,907 జవాబు పత్రాల మూల్యాంకనం జిల్లా అధికారులు, ప్రిన్సిపల్, జూనియర్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా ముగించాని తెలిపారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
గురువారం (సా)	శుక్రవారం (ఉ)
6.31	4.54



పరిశ్రమను ప్రారంభిస్తున్న భూపేష్‌రెడ్డి

పేపర్ ప్లేట్ల పరిశ్రమను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక పేపర్ ప్లేట్ పరిశ్రమను ఇక్కడున్న వ్యాపారస్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప టిడిపి పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధి లోని కోవెలకుంట్ల రోడ్డులో ప్రదీప్ ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్ పరిశ్రమను భూపేష్ రెడ్డి, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, పాస్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేష్ మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ ప్రదీప్ శ్రీను పేపర్ ప్లేట్ పరిశ్రమను జమ్మలమడుగులో భారీ ఎత్తున ఏర్పాటు చేయడం శుభపరి ణామ మన్నారు. సరసమైన ధరలకు ప్రజలకు, వ్యాపారస్తులకు అందుబాటులోకి తేవా లన్నారు. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, పాస్టర్ ప్రదీప్‌శ్రీనును అభినం దించారు. కార్యక్రమంలో టిడిపి యూత్ నాగేశ్వరరెడ్డి, కిరణ్ రాయల్, పుర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, ప్రదీప్ శ్రీను కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు టిడిపి కార్యాలయంలో బుధవారం క్రైస్తవులకు ప్రత్యేకంగా చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల పోస్టర్‌ను కడప పార్లమెంట్ టిడిపి అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు, వైస్ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 277 చర్చిలకు రూ.45 కోట్లు ఇచ్చారన్నారు. విదేశీ విద్య కింద క్రైస్తవ పిల్లలకు 68 మందికి ఒకొక్కరికి రూ.15లక్షలు ఇచ్చారన్నారు. జెరూసలేమ్ యాత్రకు 2500 మందిని పంపారన్నారు. ప్రతి క్రిస్మస్‌కు కానుక ఇచ్చేవారన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారన్నారు. సబ్సిడీ లోన్స్ ద్వారా 4300 మందికి ఉపాధి పథకాల సహకారంతో వారి జీవితాల్లో వెలుగు నింపారని వివరించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత క్రైస్తవులకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి క్రైస్తవులే బుద్ధి చెబుతారన్నారు. క్రిస్టియన్స్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి దాసు మాట్లాడారు. కార్యక్రమంలో శ్యామ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీని వాసులు, మోహన్, శ్రీనివాసులు రెడ్డి, రమణయ్య, గోపాల్, కులాయప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ బాబుల్ రెడ్డి

నేడు ప్రొద్దుటూరులో భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భార్య నారా భువనేశ్వరి గురువారం మధ్యాహ్నం 12గంటల 30నిమిషాలకు మండలంలోని పెద్ద శెట్టిపల్లె గ్రామానికి రానున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బాబుల్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అక్రమంగా చంద్రబాబుపై కేసు బనాయించి జైలుకు పంపించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకుని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ఒకటవ వార్డు మెంబర్ కూరపాటి రాధ గుండెపోటుతో మృతి చెందిందన్నారు. విషయం తెలుసుకున్న చంద్రబాబు రాధ కుటుంబానికి ఇప్పటికే ఆర్థికసాయం కూడా అందించారన్నారు. నారా భువనేశ్వరి రాధ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చనున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.



రైతుకు నగదు అందిస్తున్న టిడిపి నాయకులు

రైతుకు 'పుట్టా' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఖాజీపేట


మండల పరిధిలోని బి.కొత్తపల్లె గ్రామంలో ఇటీవల టిడిపి నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా ప్రమాదవశాత్తూ సంభవించిన అగ్ని ప్రమాదంలో రైతు బి.వెంకటసుబ్బారెడ్డికి చెందిన వరి గడ్డి వామి అగ్నికి కాలిపోయింది. రైతు తీవ్రంగా నష్టపోవడంతో స్పందించిన టిడిపి మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ రూ.80 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం టిడిపి మండలశాఖ అధ్యక్షులు లక్ష్మిరెడ్డి స్థానిక నాయకుల చేతులు మీదుగా బాధిత రైతుకు అందజేశారు. కార్యక్రమంలో తవ్వా సుదర్శన్‌రెడ్డి, తవ్వాసుబ్బారెడ్డి, కృష్ణ యాదవ్, కృష్ణయ్య, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి : భూపేష్‌రెడ్డి

- అల్లాడుపల్లెలో వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చాపాడు

రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రజలు సహకరిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి ఎంపీ అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అల్లాడుపల్లె గ్రామానికి చెందిన ఎంఎల్‌ఎన్ ఇన్ఫ్రా ఎండి పెరుగు నారాయణ యాదవ్, యర్రమాచు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పుట్టా సుధాకర్ యాదవ్, ఎంపీ అభ్యర్థి సి.భూపేష్ రెడ్డి సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపికి ఆదరణ పెరుగుతోందన్నారు. శాసనసభ ఎన్నికల్లో గెలవగానే మైదుకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్హోత్రా, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి డి.గురివిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, వేమారెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుట్టా సమక్షంలో టిడిపిలో చేరుతున్న నారాయణ యాదవ్

పింఛన్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు



పింఛన్ కోసం సచివాలయం వద్ద ఎదురుచూస్తున్న వృద్ధులు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతినెల ఒకటవ తేదీ ఇంటి వద్దనే పింఛన్లు అందుకునే అవ్వాతాతలు, విభిన్నప్రతిభావంతులు, వితంతువులు బుధవారం పింఛన్ కోసం పడిగాపులు కాశారు. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. వాలంటీర్లు పింఛన్ పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. డబ్బులు రాక పోవడంతో సచివాలయ సిబ్బంది ఫించన్లు పంపిణీ చేయలేదు. పింఛన్ అందుకోవచ్చనే ఆశతో సచివాలయాలకు వెళ్లిన అవ్వాతాతలకు, వితంతువులకు నిరాశే ఎదురైంది. ఎండలు మండుతున్నా లెక్క చేయక నచివాలయాలకు వెళ్లిన వారు పింఛన్ డబ్బు ఇవ్వకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. డబ్బుల కోసం బ్యాంకుల వెళు న్నాం.. నగదు డ్రా చేసిన వెంటనే ఇస్తామని చెప్పడంతో మళ్లీ ఇంటికి వెళ్లలేక సచివాలయాల వద్దే కూర్చోని పడిగాపులు పడాల్సి వచ్చింది. ఒక్కో సచివాలయంలో ఒక్కో విధంగా సిబ్బంది పింఛన్ దారులకు చెపుతుండడంతో చేసేదేమీలేక వెనుదిరగాల్సి వస్తోంది. ఇంటింటి పింఛన్ల పంపిణీకి తెలుగుదేశం పార్టీ అడ్డుకుందని పలువురు వృద్ధులు చర్చించుకోవడం కనిపించింది. వేంపల్లె మండల వ్యాప్తంగా అన్ని రకాల ఫించన్లు 8,050 ఉన్నాయి. పింఛన్ డబ్బులను కొన్ని బ్యాంకులు సకాలంలో ఇవ్వకపోవడంతో పంపిణీకి బ్రేక్ పడింది.

జమ్మలమడుగు రూరల్ : పింఛన్ కోసం లబ్ధిదారులు బుధవారం ఉదయం నుంచే సచివాలయాల వద్ద వేచి ఉన్నారు. అధికారులు కొన్ని చోట్ల 9 గంటలకు, మరోచోట 10 గంటలకు రావడంతో ఎదురుచూశారు. రెండు మూడు గ్రామ పంచాయతీలకు ఒకే సచివాలయం ఉన్న చోట పింఛన్ దారులు అవస్థలు పడ్డారు.

లింగాల : మండలంలో మొత్తం 5,350 పింఛన్లు ఉన్నాయి. వీరికి ఒకటో తేదీ డబ్బులు పంపిణీ చేయాల్సి ఉండగా ఏప్రిల్ నెలలో ఆలస్యమైంది. మూడవ తేదీన మండల వ్యాప్తంగా 19 పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు బుధవారం పంపిణీ ప్రారంభించారు, బ్యాంకు నుంచి నగదు తీసుకొని వచ్చేసరికి ఆలస్యమైంది. దీంతో పింఛన్లు కొచ్చిన వారు ఇబ్బందులు పడకుండా అధికారులు షామియానా, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి ఆయా గ్రామాల సచివాలయం వద్దకు లబ్ధిదారులు చేరుకున్నారు.

సింహాద్రిపురం : గత ఐదు సంవత్సరాల కాలంలో పింఛన్ పంపిణీ విధానం బాగా ఉండేదని మండలంలోని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా 5,600 పింఛన్‌దారులు ఉండగా వీరికి ప్రతినెల ఒక కోటి 56 లక్షలు రూపాయలు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈనెల పంపిణీ ఒకటో తేదీ దాటినా పింఛన్ రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. పింఛన్ కోసం గ్రామానికి దూరాన ఉన్న సచివాలయాల వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి నెల ఒకటో తేదీనే వాలంటీర్లు తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందజేసేవారని చెబుతున్నారు.

పులివెందుల రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటవ తేదీ పంపిణీ చేయాల్సిన పెన్షన్లను ఎట్టకేలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోనున్న నేపథ్యంలో పింఛన్‌లు ఎవరు పంపిణీ చేయాలనే డైలామాలో అధికారులు ఉన్నారు. ఓ వైపు వైసిపి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి అడ్డుకుంటుందని ఆరోపించారు. మరోవైపు టిడిపి ఇంటింటికి వెళ్లి సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కోరింది. ఇందులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సచివాల సిబ్బందితో బుధవారం మధ్యాహ్నం నుండి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఉదయాన్నే పంచవలసిన పింఛన్లు మధ్యాహ్నం వరకు ఆలస్యం కావడంతో ఉదయం నుంచే లబ్ధిదారులు సచివాలయ కేంద్రాలకి చేరుకొని ఎదురు చూశారు.



పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

'వరద' హయాంలోనే ప్రొద్దుటూరు అభివృద్ధి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హయాంలోనే ప్రొద్దుటూరు ఎక్కువ శాతం అభివృద్ధి చెందిందని ఆయన తనయుడు టిడిపి యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాల యంలో బుధవారం కొండారెడ్డి విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభివృద్ధి మీద మాట్లాడదామని ఛాలెంజ్ విసిరితే, ఎమ్మెల్యే, వైసిపి నాయకులు ముక్కలు ముక్కలుగా మాట్లాడి ఆక్రోశం ఎల్లబో శారన్నారు. 1994లో ఓట్లు అడగడానికి వెళ్ళినప్పుడు తాము చేసిన అభివృద్ధి చూపి ఓట్లడిగామన్నారు. వరదరాజుల రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే మైదుకూరురోడ్డు వెడల్పు చేసి సుందరీకరణ చేశామన్నారు. ప్రొద్దుటూరు అర్బన్ మండల పరిధిలో విద్యుత్ కొరత లేకుండా అన్ని ప్రాంతాలకు సరిపడా సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. 2019-24 కాలంలో ఎమ్మెల్యే రాచమల్లు ఒక సబ్‌స్టేషన్ అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. వరదరాజుల రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న ఆ సమయంలో రాజశేఖరరెడ్డి పాలనలో చేసిన అభివృద్ధిపై వైసిపి నాయకులు చెప్పుకోవడం తగదన్నారు. అభివృద్ధి అంతా వరదరాజులరెడ్డి చేసిందేనని వివరించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవి కళ్లముందే కనిపిస్తున్నాయన్నారు. ఇలాంటివి ఒక్కపనైనా ప్రస్తుత ఎమ్మెల్యే రాచమల్లు చేశాడా నిరూపించాలన్నారు.



మాట్లాడుతున్న కొండారెడ్డి

అవినాష్‌పై నేరారోపణ నిజమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప వైసిపి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిపై మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యారోపణలు రుజువైతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. న్యాయస్థానంలోగాని, ప్రజాకోర్టులోగాని రుజువైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని తెలిపారు. పిసిసి అధ్యక్షురాలు తన స్థాయిని మించి మాట్లాడుతోందన్నారు. గతంలో ఆమె తెలంగాణాకు చెందిన ఆడబిడ్డనని మాట్లాడి నేడు జిల్లాకు చెందిన ఆడబిడ్డను అని మాటమార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఎపికి తనకు సంబంధంలేదని షర్మిల చెప్పారన్నారు. క్యాలండర్‌లో పేజీ మార్చినంత సులభంగా మాట మార్చారని విమర్శించారు. వైస్ కుటుంబ చరిత్రను మరచి ఆ కుటుంబాన్ని బజారుకీడుస్తోందన్నారు. వైసిపి పేదవాడి చమటలో నుంచి పుట్టిందన్నారు. రాజకీయాలలోని రుగ్మతలకు వ్యతిరేకంగా జగన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. షర్మిల నేడు కాంగ్రెస్‌ను భూజానికెత్తుకొని మాట్లాడుతోందని విమర్శించారు. ఇదే కాంగ్రెస్‌ను దివంగత నేత వైఎస్‌ను ఎఫ్‌ఐఆర్‌లో నిందితుడిగా చేర్చిన విషయం, జగన్‌ను జైలు పాల్జేసిన విషయం తెలియదా అని రాచమల్లు ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

స్వచ్ఛందంగా 45 మంది వాలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలతో వాలంటీర్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల వ్యాప్తంగా పని చేస్తున్న 45మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ చంద్ర మౌళీశ్వర్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయంలో బుధవారం వారు ఎంపిడిఒకు రాజీనామా పత్రాలు అందజేశారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని వాలంటీర్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న జగన్మోహన్‌రెడ్డి పాలనను అధికారంలోకి తెచ్చేందుకు పాటుపడతామన్నారు.

ఎర్రగుంట్లలో మరో 11 మంది..

ఎర్రగుంట్ల : స్థానిక నగర పంచాయితీ పరిధిలోని రెండవ సచివాలయంలో పనిచేస్తున్న 11 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యకు బుధవారం అందజేశారు. రాజీనామా చేసిన వారిలో రఘు రాముడు, సురేష్‌బాబు, రామకృష్ణ, మనోహర్, శివ నాగప్రసాద్‌రెడ్డి, జయపాల్, రాజకుమారి, లక్ష్మి, శివమ్మ, పర్వీనా, వనజలత ఉన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఒ గంగిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

నేటి ప్రపంచానికి రసాయన కలుషితాలు లేని నాణ్యమైన ఎరువులు, విత్తనాలతోపాటు పురుగు మందులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వేద ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురు వారం వేంపల్లి పట్టణంలో రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బ్రాంచ్ ప్రారంభోత్సవం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థిక నష్టాలు ఊబి నుండి బయటపడి, ప్రతి రైతు వ్యాపారస్తునిగా మారడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. దేశీయ, విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు పెట్టుకుని వ్యవసాయ ఉత్ప త్తులను మార్కెటింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఆధునిక ప్రపం చంతో పోటీపడి తమ ఉనికిని ప్రపంచానికి చాటి చెప్పడానికి అత్యాధునిక వ్యవసాయ పరిజ్ఞానం సొంతం చేసుకోవడానికి ఈ కంపెనీ ఉత్పత్తులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజశేఖర్‌రెడ్డి కోరారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

రానున్న ఎన్నికల్లో ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా వేసుకోవచ్చని డిఎస్పీ యశ్వంత్ అన్నారు. మండలంలోని సమస్యాత్మకమైన ఉప్పలూరు, కొర్రపాడు, చింతకుంట, రాజుల గురువాయపల్లె, యామవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్ఐ మైనుద్దీన్‌తో కలిసి డిఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు, పోలీసులతో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు. అల్లర్లకు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పైడిపాలెంలో వైసిపి నాయకులు ప్రచారం

సింహాద్రిపురం : పైడిపాలెం గ్రామంలో వైసిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం వైసిపి మండల ఎన్నికల పరిశీలకుడు వీరశివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మండల నాయకులు బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే ప్రతి ఓటరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో బుధవారం మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, వాటి వల్ల ప్రజలకు జరిగిన మంచిని వివరించారు. వైసిపికి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజుల్లా, సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, డేనియల్ బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులు

పాలిసెట్-24 ఉచిత శిక్షణకు విశేష స్పందన

- ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మార్చి 28న ప్రారంభమైన పాలిసెట్-24 ఉచిత శిక్షణకు విశేష స్పందన లభిస్తోందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు 10 మందితో ప్రారంభమైన ఉచిత కోచింగ్ క్లాసులు వారం తిరగకముందే విద్యార్థులు 65 మందికి పెరగడం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాల అనుభవజ్ఞులైన సిబ్బంది నాణ్యమైన బోధన వల్లే స్పందన బాగుందన్నారు. ముఖ్యంగా బాలురతోపాటు బాలికలు కూడా అధిక సంఖ్యలో ఉచిత శిక్షణ తరగతులకు హాజరవుతున్నారని అన్నారు. పాలిసెట్-24 ఉచిత శిక్షణ ఇతర పోటీ పరీక్షలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నందున ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. ఈ శిక్షణ ఏప్రిల్ 25 వరకు ఉంటుందన్నారు. పాలిటెక్నిక్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేస్తే తక్కువ సమయంలో ఉన్నత శిఖరాలకు వెళ్లవచ్చన్నారు. అధ్యాపకులు థామస్ (భౌతిక శాస్త్రం), శాలిని (రసాయన శాస్త్రం), సుభాష్ చంద్ర (గణిత శాస్త్రం), పవన్‌కుమార్ (గణితశాస్త్రం), విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు



సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి మైదుకూరులోని పలు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు ప్రజల్లో భరోసా కల్పించేందుకు, ఎలాంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కవాతు నిర్వహించామని డిఎస్‌పి టి.వెంకటేశులు తెలిపారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని డిఎస్‌పి కోరారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా విని యోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. మైదుకూరు అర్బన్ పరిధిలోని గంజికుంట, లెక్కలవారిపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో పోలీస్, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ సిఐ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జెండామాన్ వీధిలో రంజాన్ పండుగ సందర్భంగా గఫూర్ చారిటబుల్ ట్రస్ట్ వారు పేదలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. వీటిని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ చేతుల మీదుగా 40 కుటుంబాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ముస్లిం నాయకుడు నూరుల్లాహ్ పేదలకు అందిస్తున్న సేవలు మరువలేనిన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పేదవారి కుటుంబాల్లో సంతోషం ఉండాలని నిత్యవసర సరుకులు, చీరల పంపిణీ చేయడం, గతంలో కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు తన సొంత ఖర్చులతో వార్డులో నీటి వసతి కోసం బోరు చేయించారని కొనియాడారు. కరోనా సమయంలో కూడా పేదల సేవా కార్యక్రమాల్లో తనవంతుగా సహాయం అందించడని ప్రశంసించారు. కార్యక్రమంలో రాష్ట్ర నూర్ భాషా సంఘం చైర్మన్ ఓతూరు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హామద్, ఖలీల్, నూరు డొనాల్డ్ పాల్గొన్నారు.

మరియన్న కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని ప్రభునగర్‌లో ఓబులేసు, సోమిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో మంచాన ఉన్న చిట్వేలి పుల్లమ్మ, కలివేల మరియన్నను బుధవారం టిడిపి మండల నాయకుడు ఎల్లటూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య క్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూజ శివయ్య, ఓబయ్య, భాస్కర్, రవి పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE IV ADDL. DISTRICT JUDGE COURT, KADAPA

G.O.P. NO. 12 /2023

(For appoint of the Guardian in the matter of M.Vishnu Vardhan reddy to sell the petition schedule property by their natural mother J. Pushpa Latha Reddy)

M.Vishnu vardhan reddy,
Rept. by her natural mother :J.Pushpa latha reddy **...Petitioner**

Vs

Nil. **...Respondent**

It is hereby inform to the general public that M. Vishnu Vardhan Reddy minor Rep by his mother J. Puspa Latha Reddy has filed G.O.P.No.12/2024 before Hon'ble IV Additional District Judge court Kadapa to sell the below schedule property of minor share by appointing of his mother J. Puspa Latha Reddy as a guardian.The said G.O.P. No 12/2024 posted on 15.04.2024 at 10.30 A.M for objections/claims from third parties.

SCHEDULE

Kadapa district, Kadapa rural sub-district, Kadapa Municipal Corporation, Ramarajupalli village fields Circar punji D.no.107 / 2 after sub-division 107/2A in this plot no 53,54,55 total an extent of Ac 0.12 cents 51 sq links in this plot no 53 an extent of Ac 0.04 cents 17sq links or 194.44 sq yards bounded by:-
East: plot no 30 site West:24 ft wide road.
North: P.Ramachandra Reddy purchased plot no 54 site South:plot no 52 sold by S.Niroopa today. in this :-
East : west : on both sides : 50 ft or 15.25 Mtrs.
North : south : on both sides : 35 ft or 10.66 Mtrs.

G.VENKATESWARA REDDY
Advocate,
KADAPA.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం./2024 ఇన్ ఐ.ఎ.నెం.433/2023
ఇన్
సి.యఫ్.ఆర్.నెం.7784/2023
ఇన్
ఓ.యస్.నెం./2023

1. బోయ.మౌలాలి
2. బోయ.రామాంజనేయులు. ...అర్జీదార్లు /వాదులు

-ఎదురి-

గంగుల వెంకట సుబ్బారెడ్డి. ...రెస్పాండెంటు/ప్రతివాది

రెస్పాండెంటు/ప్రతివాదికి నోటీసులు

గంగుల వెంకట సుబ్బారెడ్డి తండ్రి జి.సంజీవ కొండారెడ్డి, హిందూ, ప్రస్తుతనివాసం,జమ్మలమడుగు గ్రామం మరియు పోస్టు, కడప జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు/అర్జీదారులు, రెస్పాండెంటు అయిన మీపైన దావా దాఖలు చేయుటలో అలస్యంను మన్నించమని ఐ.ఎ.నెం.433/2023 ఇన్ సి.యఫ్.ఆర్.నెం.7784/2023 ఇన్ ఓ.యస్.నెం. /2023 కోరుతూ అర్జీ దాఖలు చేసినారు. ఇందులో రెస్పాండెంటు/ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 18-4-2024 తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 18-4-2024

యం.ఆర్.క్రిష్ణ,
యస్.పాపన్న,
అర్జీదారు పరం అడ్వకేట్లు, కర్నూలు.